# నీడ

''మనమెటు కదిల్తే మననీడ అటు కదుల్తుంది. దానికో స్వంత అస్తిత్వంలేదు. మనం నీడలమా, మనుషులమా?'' అంది ఉష మధు వంక చూస్తూ.

సాయంకాలపు ఎండలో పొడుగ్గాసాగిన ఆమె నీడ వంక చూశాడు మధు. ముందు కొంచెమై, తరువాత క్రమంగా పొడుగ్గాసాగే అపరాహ్నం తరువాత నీడలా వాళ్ల పరిచయం దగ్గర దగ్గర మూడేళ్ల నుండి సాగుతోంది. ఇద్దరూ కాసుమేట్స్. అతను క్లాసులోనూ, బయటా ఎక్కువ మాట్లాడడు. తనలో తను ముడుచుకు పోయి వుంటాడు. అతన్ని చూస్తే ఆమెకు జాలీ. మరోసారి చిరాకూ కల్గుతుంటాయి. సాయంత్రం ఏడుగంటలకు వాళ్ల క్లాసుమేటు నీరజ వివాహం. అతనికి తనొక్కడే వెళ్లాలంటే సిగ్గు. అంతమందిలో తను ఇమడలేడు. పెళ్ళికి వెళ్లకపోతే బావుండదు. నీరజ మరీ మరీ చెప్పింది పెళ్ళికి తప్పక రావాలని. ''మీరు పెళ్ళికి వెళ్లేటట్లయితే నేనూ వస్తాను'' అంటే ఉష అతనితో అన్నమాటలివి.

మధు మాట్లాడలేదు. సాయంత్రం ఐదుగంటలవుతోంది. క్లాసులయిపోయాయి. విద్యార్థులు ఇళ్ళకెళ్తున్నారు. కొంతమంది ఆవరణలో వాలీబాల్, బాడ్మెంటన్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ లాంటివి ప్రాక్టీసు చేస్తున్నారు.

''నేను పెళ్ళికి రాకపోతే మీరు వెళ్ళరా?'' అడిగింది ఆమె.

''ఏమో అంతమందిలో నాకు ఊపిరాడదు.'' అన్నాడతను.

''ఏం మిగతా మన క్లాసుమేట్స్ కూడా వస్తారుగా.''

''వస్తారు. అందరితో నేనెక్కువగా మాట్లాడనుగా.''

''అక్కడికి అదో గొప్ప అయినట్లు. వెళ్ళండి. అందరితో కలిసి వుండండి. నాతో తప్ప, అందరితో కలిసి వుండకపోవటంవల్ల అందరూ అంటున్నారు మీరు నాకు షాడో అనీ, శాటిలైట్ అనీ. నేనెటు కదిల్తే మీరటు కదుల్తారట. ఆమాటలు వినటానికి నాకు సిగ్గుగా వుంది. మీకన్పించదా అలా?''

అతనేం మాట్లాడలేదు. ఎండలో తన నీడ పడుతున్నట్లు లేదు. 'తనే నీడకదా, తనకో నీడ వుండదు' అన్పించింది అతనికి. అలా స్ఫురించగానే ఆమె మాటలు చిరాకు తెప్పించాయి అతనికి.

''సరే నేనే వెళ్తాను. మీరు రానక్కరలేదులెండి'' అంటూ గబగబా నడ్చుకుంటూ వెళ్ళిపోయాడు అతను.

విస్తుపోయి చూస్తూ నిలబడింది ఉష. అయినా ఆమె కానందంగానే వుంది. నీడలు విడిపోయి అతనంత అతనుగా కన్పిస్తున్నాడిప్పుడిప్పుడే.

బి.కాం. మొదటి సంవత్సరంలో చేరిన కొత్తల్లో మొదటిరోజున కామర్సు లెక్చరరు అడిగాడు విద్యార్థుల్ని తామెందుకు బి.కాం చదవాలని అనుకున్నారని. విద్యార్థులు రకరకాల సమాధానాలు చెప్పారు. 'ప్రగతి పథంలో సాగే మనదేశంలో వాణిజ్య వ్యాపారరంగాలు ఎక్కువగా అభివృద్ధి చెందే అవకాశం వుంది. అందువల్ల కామర్సు చదివిన వాళ్ళకు ఎక్కువ ప్రాస్పెక్ట్స్ వున్నాయి' అన్నారు కొంత మంది డాబుగా. 'సైన్స్, ఆర్ట్సుల్లో తమ కభిరుచి లేదన్నారు' కొంతమంది. 'సైన్సులో సీటు దొరకలేదన్నారు' మరికొంత మంది. ఒక్క మధుమాత్రమే. ''మా మామయ్య కామర్స్ చదవమన్నాడు. అందుకని కామర్స్ తీసుకున్నాను'' అని సిగ్గుపడ్తూ చెప్పాడు.

''అదేంటోయ్! నీకు స్వంత వ్యక్తిత్వం లేదా. నువ్వు ఏం చదవాలో నీకు నువ్వు నిర్ణయించుకోవాలికదా'' అడిగాడు కామర్స్ లెక్చరర్.

''ఏమో నాకు తెలీదు సార్'' అన్నాడు మధు.

ఆమాటతో గొల్లున నవ్వారు విద్యార్థులు. సిగ్గుపడి కూర్చుండిపోయాడు మధు.

అదే మొదటగా ఉష అతన్ని గుర్తించటం. అతని అమాయకత్వంపట్ల జాలికలిగింది ఆమెకు.

''పెద్ద వాళ్ళు మనం ఏం కోర్సు తీసుకోవాలో గైడ్ చేయటంలో తప్పులేదుగా సార్. అయినా మనదేశంలో అందరూ అనుకున్న కోర్సులు చదవగలరా? అలాంటి అవకాశం వుందా?'' అంది ఉష లేచి నిలబడి.

''నిజమే. నువ్వు చెప్పింది నిజమే'' అన్నాడు ఆయన.

మొదటిసారిగా మధు ఉషలో తన నీడను వెతుక్కున్న క్షణమది.

కాలేజీ యూనియన్ ఇనాగరల్ ఫంక్షనప్పుడు అతను పాటలుపాడాలని బలవంతం చేశారు సహ విద్యార్థులు.

''అమ్మో! నేను పాడను'' అన్నాడు మధు. అంతమందిలో లేచి నిలబడి పాడటం ఊహించుకోగానే ముచ్చెమట్లు పోశాయి అతనికి.

''నువ్వు పాడాల్సిందే'' అని బలవంతం చేస్తున్నారువాళ్లు.

''పోనీ అంత బలవంతమెందుకు. అతనికిష్టం లేకపోతే వదిలెయ్యొచ్చుగా'' అంది ఉష ఆ సంభాషణలో తనూ జోక్యం చేసుకుంటూ.

''మధు చాలా బాగా పాడ్తాడు ఉషగారూ! పాటలు రాకపోతేసరే. వచ్చినవాళ్ళు కూడా పాడకపోతే ఎట్లా? మన క్లాసు పరువు కాపాడాల్సిన భారం అతని మీద లేదా?'' అన్నాడు రవీందర్, క్లాసు రిప్రజెంటెటివ్‌గా ఎన్నుకోబడ్డ బడ్డింగ్ లీడర్.

''క్లాసు పరువు కాపాడాలని వుంటే మీరు పాడండి. ఇష్టంలేని అతన్ని బలవంతం చేయటం ఎందుకు?'' అంది ఉష.

''ఇంక ఈమెకూడా వత్తాసు వస్తోంది. ఇహ వాడు ఛస్తే పాడడు. పదండిరా రాజునయినా అడుగుదాం, మన క్లాసు పరువుకాపాడమని'' అన్నాడు రవీందర్. 'హోలో' మంటూ విద్యార్థులందరూ అతన్ని వదిలేసి వెళ్లిపోయారు.

మధుకూడా బయటకు వెళ్ళి బయట కాలేజీ ఆవరణలో చిటికేసర చెట్టు కింద కూర్చున్నాడు వంటరిగా. అది లంచ్ పీరియడ్. అందువల్ల మళ్ళీ రెండింటికి క్లాసులు మొదలయిందాకా కాలక్షేపం చేయాల్సిందే. నీరజ, వనజ, రమాప్రభలతో లంచ్ చేసివస్తూ ఒంటరిగా కూర్చున్న మధుని చూసి, ''మీరు పదండే, అతన్ని పలుకరించివస్తాను'' అని ఉష అతనున్న దగ్గరకు వచ్చింది.

''ఏం మీమామయ్యకు మీరు పాడటం ఇష్టంలేదా?'' అంది ఆమె అతని పక్కన కూర్చుంటూ.

మధు ఎగాదిగా ఆమె వంక చూశాడు. ఆమె మాటలు మొదట అర్థం కాలేదు అతనికి. అర్థం అయేటప్పటికి సిగ్గుతో మొహం ఎఱ్ఱబడిపోయింది.

''అలా అని చెప్పానా మీకు?'' అన్నాడతను కోపం ధ్వనింపచేస్తూ.

''చెప్పారా? చెప్పారు. చెప్పక చెప్పారు.''

''ఎప్పుడు.''

''కాలేజీకి వచ్చిన మొదటిరోజు. మీ మామయ్య బి.కాం. చదవమన్నాడని చెప్పినరోజే మిగతా విషయాలు కూడా చెప్పారు.''

అతనేం మాట్లాడలేదు.

''మీ మామయ్య హిట్లరా?''

''ఏమో హిట్లరో, బట్లరో ఆయనకు ఎదురుచెప్పలేను.''

''మరి మీ అమ్మా నాన్నా!''

''అమ్మా నాన్నా నా చిన్నప్పుడే పోయారు. మామయ్య దగ్గరే పెరిగాను.''

''సినిమాలు చూస్తారా?''

''చూడను.''

''ఎందుకని?''

''ఇప్పుడొచ్చే సినిమాల మీద మామయ్యకి మంచి అభిప్రాయం లేదు.''

''మరి మీ అభిప్రాయం ఏమిటి?''

''ఏమో, నేనెప్పుడూ ఆలోచించలేదు.''

''నేనెలా వున్నాను?''

''బావున్నారు''

''అలా అనకండి. మీ మామయ్య అభిప్రాయం కనుక్కొని వచ్చి చెప్పండి?''

''ఇందులో మామయ్య ప్రసక్తి ఏముంది?''

''అదే నేనేది. ఎందులోనూ ఆయన ప్రసక్తి లేదు. మనకు కొంత వయసు వచ్చింది. ప్రపంచాన్నీ, సమాజాన్నీ గూర్చి మనకు కొన్ని అభిప్రాయాలుండాలిగా''

''మా మామయ్య నేనెప్పుడేది మాట్లాడినా, చిన్నప్పుడైతే చెమడాలెక్కదీసేవాడు, ఇప్పుడు కసురుకుంటాడు.''

''అంటే మీరు ఎదిగారని ఆయన గుర్తించాడు కానీ, మీరు మాత్రం గుర్తించలా?''

''గుర్తించి ప్రయోజనమేంటి? ఆయనకెదురుచెప్పలేను.''

''అంటే ఈ చిటికేసర చెట్టువుందా. దాని నీడకింద మనం కూర్చున్నాం. చెట్టులేకపోతే నీడ వుండదు. మీ మామయ్య లేకపోతే మీరు వుండరా?

''అదేం మాట, మామయ్య వుండకెక్కడకు పోతాడు?''

''మీ మామయ్యేకాదు, ఎవరూ శాశ్వతంకాదు.''

''నిజమే.''

''ఏమనుకోకండి? మీ మామయ్య ఓ వటవృక్షం. ఆ వృక్షం కింద మీలాంటి చిన్న మొక్కలు బతకవు. బతకలేక ఆ వృక్షానికి నీడలయిపోతాయి. మీ అంతట మీరు పుష్పించి, ఫలించాలో, లేక జీవితాంతమూ నీడగా వుండాలో ఆలోచించుకోండి'' అంటూ లేచి వెళ్ళిపోయింది ఉష.

అదే మొదలు అతనిలో ఆలోచనల ఉషోదయమవటానికి. ఏడురంగుల ఇంద్రధనస్సులా

కన్పించిందామె అతనికి.

ఓ రోజు విద్యార్థులంతా వెళ్ళిపోయినా అతను కాలేజీ కాంపౌండులోనే కూర్చుండిపోయాడు ఫుట్‌బాల్ ఆటచూస్తూ. అకౌంటెన్సీలో తనకున్న సందేహాలు లెక్చరర్ని అడిగి తీర్చుకువస్తున్న ఉష అతన్ని చూసింది.

''హలో! ఇక్కడ కూర్చున్నారే? ఇంటికెళ్ళరా?'' అంటూ అతని పక్కకి వచ్చి నిలబడింది ఆమె.

''ఆఁ కీస్ లేవు'' అన్నాడు అతను.

''కీస్ లేవా? అంటే...'' అంది ఆమె అర్థంకాక అతనివంక చూస్తూ. అప్పుడతనికి అర్థమైంది, ఇలా టెలిగ్రాఫిక్ లాంగ్వేజీలో మాట్లాడితే ఆమెకెలా తెలుస్తుంది అని.

''మామయ్యావాళ్ళు బంధువుల ఇంటికి పెళ్ళికెళ్ళారు. ఇంటికి తాళం వేసి వెళ్ళారు. వాళ్ళు వచ్చేటప్పటికి ఆరో, ఏడో అవుతుంది. అందుకని ఇక్కడ కూర్చున్నా''

''మీకు కీస్ ఇచ్చి వెళ్ళవచ్చుగా వాళ్ళు''

''వాళ్ళెప్పుడూ నాకు తాళం చేతులు ఇవ్వరు. నేను మతిమరుపు మనిషినట. ఎక్కడయినా పారేస్తానేమోనని వాళ్ళ భయం.''

''హాఁ బావుంది. అయితే మా ఇంటికి రారాదూ, కాస్త టీ తాగి వెళ్దురుగానీ''

''ఇప్పుడా బాబ్రే'' అన్నాడు అతను అప్రయత్నంగా.

''ఏంటలా హడలిపోయారు? మిమ్మల్నేం కొండలెత్తమన్నానా? బండలు కొట్టమన్నానా?'' అంది ఉష.

''ఛ ఛ అది కాదు మరి....'' ఆగిపోయాడు మధు.

''ఆడపిల్లలతో వాళ్ళ ఇంటికి వెళ్ళటం మీమామయ్యకు ఇష్టం వుండదనుకుంటా''

''ఇందులో ఆయన ఇష్టమేముంది? పదండి వెళ్దాం'' అన్నాడతను లేచి ముందుకు అడుగేస్తూ.

''దట్స్ ద స్పిరిట్. ఐ అడ్మైర్ ద వే యుట్రైటు ఫైటిటవుట్''

''ఏంటది?''

''మీ మామయ్య ప్రభావం నుండి బయట పడాలని ప్రయత్నించటం''

మధు ఏం అనలేదు. ఇల్లు వచ్చింది. గేటు తెరచి లోపలకు నడిచింది ఉష. ఆమెను అనుసరించాడు మధు. డ్రాయింగ్ రూంలోనే ఆగిపోయాడు అతను.

''అయ్యో! ఆగిపోయారేం రండి'' అని ఆమె లోపలకు దారితీసింది. తల్లికీ, చెల్లెలికీ పరిచయం చేసింది అతన్ని. మధు సిగ్గుపడుతూ ''నమస్తే'' చెప్పాడు.

''రండి, నాగదిలో కూర్చుందాం'' అని ఆమె అతన్ని తన గదికి తీసుకెళ్ళింది.

ఓ మూలగా టేబుల్. దాని దగ్గరగా రెండు కుర్చీలు. ఇద్దరూ కూర్చున్నారు. చాలాసేపు క్లాసులమీద, లెక్చరర్లమీద, యూనియన్ మెంబర్లమీద తన అభిప్రాయాలు తెలియజేయసాగింది ఆమె. అతను వింటూ 'ఊఁ'కొడుతున్నాడు. మధ్యలో అతని అభిప్రాయం అడిగినపుడు మీరు చెప్పిందే కరెక్ట్' అంటున్నాడు. పొడిపొడిగా మాట్లాడటం రాదామెకు. ఏ విషయమైనా ఫ్లాష్‌బాక్‌లూ, ఫ్యూచర్ ప్లాన్స్‌తో సహా వివరంగా చెప్తుంది. చెప్పించుకుంటుంది.

పనిమనిషి టీ తెచ్చిస్తే తాగారు.

'ఊఁ ఇహ చెప్పండి మీకథ'' అంది ఆమె.

''ఏం వుంది నా కథ చెప్పటానికి?''

''వున్నదే. మీ అమ్మానాన్న పోయారు. మీరు మీ మామయ్యదగ్గర కొచ్చారు. చాలా చిన్నప్పుడే అవునా?

''అవును''

''మీకాస్తి వుందా?''

''ఏమో నాకు తెలీదు. మామయ్య చెప్పలేదు''

''మీరడగొచ్చుగా''

''ఏమని? నా ఆస్తి ఏముంది అనా? ఆమాటంటే కాళ్ళు విరగ్గొడతాడు. ఆయన దయమీద బతుకుతున్నవాడిని. నన్ను నిరాశ్రయుణ్ణి చేయకండి''

''మిమ్మల్ని ఆయన అంత త్వరగా ఇంటినుండి బయటకు పంపించడు. భయపడకండి. ఆయనకు మీతో ఏదో అవసరముంది.''

''మీకెలా తెల్సు?'' అన్నాడు ఆశ్చర్యంగా

''ఇంకా చాలా తెల్సు. మీరే చెప్పారు.''

''నేనా?''

''ఆ. మీ ముఖం, మీవాలకం, ప్రవర్తన, నడకా, వేసుకునే గుడ్డలు - అన్నీ మిమ్మల్ని వ్యక్తపరుస్తుంటాయి. అఫ్‌కోర్స్ అందరి విషయంలోనూ అంతే ననుకోండి. కానివ్వండి వివరంగా చెప్పండి. సానుభూతితో అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తాను.''

అతను చెప్పసాగాడు.

''నాకు అందర్లా తల్లీదండ్రీ ప్రేమ తెలియదు. మామయ్య ఇంట్లో నేను బానిసను. అక్కడ నా అభిప్రాయానికి విలువలేదు. ఏదీ ధైర్యంచేసి అడిగే అర్హతా, ఆస్కారంలేవు. ఒకవేళ అడిగినా అనుమతి దొరకదు, కోరికతీరదు. చిన్న పిల్లాడిగా వున్నప్పుడు ఓరోజు తోటి పిల్లల్నిచూసి మోజుపడి కుడిపాపడి తీసుకుని తలదువ్వుకున్న పాపానికి, నానా తిట్లుతిట్టి, 'నీ మొహానికి తోడు షోకులు తక్కువయ్యాయట్రా వెధవా? ఇంకోసారి ఇట్లాంటి వెధవ్వేషాలు వేశావంటే ఎముకలు విరగ్గొడ్తా గుర్తుంచుకో' అంటూ బెదిరిస్తే బిత్తరచూపులుచూస్తూ 'తప్పయి పోయింది మామయ్య! ఇంకెప్పుడూ చేయనుగా' అన్న వేడ్కోలుతో ప్రారంభమయింది నారాజీ జీవితం.'' అంటూ మొదలెట్టాడు మధు. అన్నిమాటలు ఒక్కసారిగా మాట్లాడటం జీవితంలో అతనికి ప్రథమం 'ఏమిటీమె ఎదురుగుండా ఇన్ని మాటలు చెప్తున్నాను' అన్న ఆశ్చర్యం కలిగింది అతనికి.

''తరువాత?''

''తరువాతేముంది. టెంత్ క్లాసు అయిం తర్వాత నా చదువు ఆపెయ్యాలని చూశాడు ఆయన. మామయ్య పెద్ద కూతురు సంధ్య - నాకంటే పెద్దదే. ఇప్పుడు పెళ్ళికూడా అయిపోయింది అనుకోండి - ఆమె పట్టుబట్టటంతో నా చదువుకొనసాగింది. ఆ ఇంట్లో ఆమెకే నేనంటే సానుభూతి వుండేది. మామూలుగా ఎందులోనూ ఎదురుచెప్పని నేను ఇంటర్మీడియట్‌లో ఎం.పి.సి. గ్రూపు తీసుకుంటానన్నాను. 'ఏం అక్కర్లేదు. నీ ముఖానికి లెక్కలేం వచ్చి ఏడుస్తాయి. సి.ఇ.సి. తీసుకోవాలు. తర్వాత బి.కాం చేద్దువుగాన్లే' అన్నాడు ఆయన. ఇంటర్మీడియట్‌లోకూడా నిక్కర్లు వేసుకునే జూనియర్ కాలేజీకి వెళ్ళేవాడిని. నన్ను చూసి అంతా నవ్వేవాళ్ళు. అయినా పాంట్లు కుట్టించి ఇమ్మని అడిగే ధైర్యం నాకుండేదికాదు. మూగవాళ్ళయితే తమ భావోద్రేకాలు ఎలా ఆపుకుంటారో తెలీదుగానీ, మాటవచ్చీ మాట్లాడకుండా వుండాలంటే బహుకష్టం. నన్నో మనిషిగాకాక, ఓ యంత్రంగా భావిస్తాడేమో ఆయన. అడిగినంత వరకే, అవసరమైనంతవరకే మాట్లాడాలి. ఎక్కువ మాట్లాడితే చిన్నప్పుడు కొట్టేవాడు. ఇప్పుడు కసురుకుంటాడు, విసుక్కుంటాడు. ఓ విధంగా మా అత్తయ్యే మంచిది. ఆమె నన్నేమీ అనదు, అసలు నా ఉనికినే పట్టించుకోదు. పట్టనట్టు వుంటుంది. స్వంత మామయ్యే నన్ను శత్రువులాగ చూస్తుంటే ఆమె దయ, సానుభూతి చూపించలేదని అనుకోవాల్సిన పనిలేదు'' అన్నాడు మధు.

''ఇంకా చెప్పండి. అసలు పాయింటుకురాలేదు'' అంది ఆమె.

''ఇంకేం అసలు పాయింటు?''

''మిమ్మల్నింకా ఆయన ఇంట్లో వుంచుకుంటున్నాడంటే, చదివిస్తున్నాడంటే దాంట్లో ఏదో కీలకముంది. అదేదో చెప్పండి.

''సరిగ్గా గుర్తించారు. ఆకీలకం బుజ్జి. మా మామయ్య చిన్నకూతురు, అసలు పేరు ఛాయాదేవి. ఈ డిగ్రీ పూర్తికావటంతోనే నన్ను బుజ్జికిచ్చి పెళ్ళిచేస్తాడు. నవ్వకండి పెళ్ళైతే ఆమె ఆడమన్నట్టు ఆడాల్సిన వాణ్ణేనేను. నాకిచ్చి బుజ్జి పెళ్ళిచేయటంకాదు. నన్ను బుజ్జికిచ్చి పెళ్ళి చేయటమది. సంధ్య ఎంత తెలివైందో బుజ్జి అంత మందమతి, మూర్ఖపుది. అనాకారి ఆపైన పరమగయ్యాళి. ఆపిల్లకు పెళ్ళవటం కష్టంగావుంది. అందువల్ల నేనా పిల్లను చేసుకుని, ఆయన షాపు చూస్తూ కాలం గడపాలి. ఇవీ ప్రస్తుతం మా మామయ్య ఆలోచనలు.''

''మీ ఆలోచనలేమిటి?''

''నాకు పారిపోవాలనివుంది.''

''మరి పారిపోండి.''

''అదంత తేలిగ్గాదు. మామామయ్య గురించి మీకు తెలీదు. ఏమారుమూల ప్రదేశంలో వున్నా నన్ను గుర్తించగలడు. లాక్కెళ్ళి మరీ కూతురి మెళ్ళో తాళి కట్టిస్తాడు.''

''మరీ అంత బేలగా మాట్లాడకండి మధూ! ఈ రోజుల్లో ఒక ఆడపిల్ల మెళ్ళోనే బలవంతంగా తాళికట్టించలేక పోతున్నారు. అలాంటిది మొగాళ్ళయ్యుండీ మీకు సిగ్గుగా అన్పించటంలేదూ అట్లా అనుకోటానికి?''

''ఏ ఆసరా లేని నాకు సిగ్గెందుకులెండి.''

''ఇలాటి చచ్చుమాటలు మాట్లాడకండి. మిమ్మల్ని మీరు ఎందుకు కించపర్చుకుంటారు? ఆత్మగౌరవం లేనట్లు మాట్లాడతారు? తనను తాను గౌరవించుకోలేనివాడు ఇతరులను గౌరవించలేడు. ముందు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోండి. దానికి నల్గురితో కలిసి పోవటం నేర్చుకోవాలి. మీరు ఈ ప్రపంచంలో వంటరి వాళ్ళుకాదు. ఉండండి, మానాన్నగారు రాంగానే పరిచయంచేస్తాను. ఆయన్తో కొంత కాలం గడిపారంటే మీ బుఱ్ఱనిండా మాటలే టేప్‌చేసి పెడ్తారు. ఇక కదిలిస్తేచాలు....'' అంటూ నవ్వసాగింది ఉష.

''మీరెంత హాయిగా నవ్వగలరు?'' అన్నాడు మధు

''మీరూ నవ్వండి. నవ్వు శారీరక, మానసికారోగ్యాలకుమంచిది.''

గడియారం ఏడుగంటలు కొట్టింది. ఉలిక్కిపడ్డట్టు లేచాడు మధు.

''అదేంటి అలాలేచారు?'' అడిగింది ఆమె.

''అమ్మో! ఏడుగంటలయింది. ఇంటికాలస్యంగావెళ్తే మా మామయ్యగోల చేస్తాడు. వెళ్తాను'' అని మారు మాటాడకుండా వెళ్ళిపోయాడు మధు.

అప్పటికి వెళ్ళాడు కాని, ఆ తర్వాత ఆమె నుండి అంత త్వరగా వెళ్ళలేకపోయాడు. ఆమె అతడు తన మామయ్య ప్రభావం నుండి బయటపడాలని దీక్షపట్టింది. ఆమెతో పరిచయమైనప్పటినుండి అతనిలో బేలతనం తగ్గసాగింది. అందరితో కలివిడిగా వుండలేకపోయినా తనను తాను కించపరచుకోవటం మానేశాడు. ఆమె మాటల్లో, స్నేహంలో అద్వితీయమైన మాధుర్యాన్ని అనుభవించసాగాడు.

మధు మామయ్య లక్ష్మీనారాయణగారికి మెయిన్ బజారులో జనరల్ స్టోర్స్ వుంది. ఆయనపేరు మీదే దాన్ని లక్ష్మీన్నారాయణ జనరల్ స్టోర్స్ అంటారు. బిజినెస్ బాగానే నడుస్తోంది. ఉష ఓ రోజు పౌడరు డబ్బా తెచ్చుకోవటానికి వెళ్ళి ఆయన్ని పరిశీలించి చూసింది. కష్టమర్లతో మర్యాదగా మాట్లాడినా, పనివాళ్ళతో చాల కఠినంగా వ్యవహరించటం ఆమె చూసింది. దాంతో ఆమెకు అతని నైజం అర్థమయింది.

ఓరోజు మధూ, ఉషా కాలేజీ నుండి తిరిగివస్తుంటే ఫర్లాంగు దూరంలో లక్ష్మీనారాయణ రోడ్డు మీద ఎవరితోనో మాట్లాడటం కన్పించిందామెకు. మధు ఆయన్ని చూడలేదు. ఉష మనస్సులో ఆలోచన వచ్చింది.

''మధూ! మీరెప్పుడైనా స్మోక్ చేశారా?'' అనడిగింది ఆమె.

''లేదండీ'' అన్నాడతను.

''మీకంత ధైర్యంకూడానా, పొరపాటున అడిగాను లేండి. నాదే తప్పు. సిగరెట్టు తాగితే మీ మామయ్య కొట్టడూ మిమ్మల్ని'' అంది.

''ఆయన ఇష్టమేమిటి? నేను తాగుతాను తందనాలాడతాను. ఆయనకనవసరం'' అన్నాడు అతను కోపంగా.

''మాటలకేం లేండి. నేనూ చెప్తాను. అసలు మీకు ధైర్యముందా అని సిగరెట్టు తాగటానికి''

ఆ మాటతో అతనికి పౌరుషం ముంచుకొచ్చింది.

''చూడండి ధైర్యముందో లేదో'' అని చరచరా ఎదురుకుండా వున్న కిళ్ళీ బడ్డీలో కెళ్ళి ఓ సిగరెట్టుకొని, ముట్టించి, విలాసంగా పొగవదుల్తూ వచ్చాడు.

''బాగుంది. ఇప్పటికి మొగధీరులయారు.''

''మీరు స్ఫూర్తినివ్వాలేగానీ, మా మామయ్యనెదిరించటం ఎంతసేపు?'' అంటూ

ఎదురుకుండా చూసిన మధుకు మతిపోయింది. ఆయనా మేనల్లుడి వంక గుర్రుగా చూస్తున్నాడు

''మీ మామయ్య'' అంది ఉష లోగొంతుకతో

అయితే ఆయనంటే పెద్ద లెక్కలేనట్టు సిగరెట్టు చేతిలో పట్టుకునే ముందుకు నడిచాడు మధు. ఓ ఆడపిల్లముందు ఆయనకు జడియటానికి మనస్సంగీకరించలేదు అతనికి.

ఓ నూరు గజాల దూరం వెళ్ళిన తరువాత అంది ఉష.'' ఇవాళ వుంది లేండి మీకు బడితెపూజ.''

''చూస్తారుగా. ఇక ఆయన చెప్పినట్టు బతికేదిలేదు. ఇవాళ నా వంటి మీద చెయ్యివేశాడంటే చూడండి. ఇంట్లో నుండి పారిపోయేది ఖాయం'' అన్నాడు బింకంగా మధు.

అతనికి లోపల్లోపల భయంగానే వుంది, మామయ్య ఇంట్లోనుంచి వెళ్ళగొడ్తే ఎలా బతకాలి అని.

''ఒక్కమాట. మీ మామయ్య ఇంట్లోనుండి వెళ్ళమంటే మాత్రం పారిపోకండి. మా ఇంటికిరండి. మానాన్నగారికి చాల పలుకుబడి వుంది. ఆయన మీకు ఏదో పార్ట్‌టైం జాబ్ ఇప్పిస్తారు. ఎవరిమీదా ఆధారపడకుండా కాలమెళ్ళదీయవచ్చు'' అంది.

''సరే'' అన్నాడు అతను.

''మరి మర్చిపోగూడదు.''

''మర్చిపోనుగా''

ఉష అనుకున్నట్లుగానే ఆరోజు ఇంట్లో పెద్ద గొడవైంది. లక్ష్మీనారాయణ మేనల్లుణ్ణి తిట్టి కొట్టబోయాడు. మధు సహించలేదు అది.

''నావంటి మీద చెయ్యేస్తే నీకు మర్యాద దక్కదు మామయ్యా!'' అన్నాడు.

''ఏంరా నీకంత పొగరు. ఎవర్ని చూసుకునిరా ఆ హజం? దమ్మిడీ పెడ్తే ఏగాణీ చెయ్యవు. ఆడపిల్లల్ని వెంటేసుకు తిరగటమేకాక, సిగరెట్లు కూడా కాలుస్తావా? నీ అడుక్కుతినే మొహానికి సిగరెట్లుకూడా కావాల్సి వచ్చాయా? గాడిదా! నా ఇంట్లోంచి పో. రెండు రోజులు డొక్కమాడ్తే తిక్కతిరిగి నువ్వే తిన్నగా దారిలోకి వస్తావు. బయటకు వెళ్తే నీకు తిండి పెట్టే వాడెవడురా పో! దరిద్రపు మొహమా!'' అని మేనల్లుణ్ణి ఓ తోపు తోశాడు ఆయన.

అంతే మధు కట్టు గుడ్డలతో ఆయన ఇల్లు వదలి వచ్చాడు. తిన్నగా ఉష వాళ్ళింటికే వెళ్ళాడు. ఉష తండ్రికి అతని పరిస్థితి అంతా వివరించి చెప్పింది. ఆయన ఎంతో సానుభూతి

చూపించాడు. ఓ సినిమాహాలు ఓనరు దగ్గరకు తీసుకవెళ్ళి, ఆయన్ని మొహమాటపెట్టి అతనికి బుకింగ్ క్లర్క్ ఉద్యోగమిప్పించాడు. సినిమా మొదట ఆటకు, రెండో ఆటకు టిక్కెట్లు ఇవ్వాలి. అకౌంట్లు రాసి పెట్టాలి. ఇది మధు ఉద్యోగం. మధు సినిమా హాల్లోనే ముందు గదిలో వుండవచ్చు. నెలజీతం రెండొందలు. పగలు మాట్నీషోకి అంత రష్ వుండదుకాబట్టి వున్న మరో బుకింగ్ క్లర్క్‌తో పనిగడుపుకుంటాడు యజమాని. పగలు మాత్రం మధుకేమీ పనిచెప్పడు. అలా అతన్ని పనిలో కుదిర్చి చేతిలో ఓ వంద రూపాయలుంచి, వెళ్ళిపోయాడు ఉష తండ్రి.

అలా ప్రారంభమైంది మధు స్వావలంబనం, స్వతంత్ర జీవనం. ఆతరువాత లక్ష్మీన్నారాయణ వచ్చి అతన్ని బతిమిలాడి ఇంటికి తీసుకెళ్ళాలని ప్రయత్నించాడు కాని, మధు మాత్రం ససేమిరా వాళ్ళ ఇంటికి తిరిగి వెళ్ళ నిరాకరించాడు.

ఇప్పుడు మధు, ఉషకు నీడలా సంచరించసాగాడు. ఆమె ఏమాటన్నా పెద్ద సత్యంలాగా కనపడసాగింది అతనికి. ఆమె లేకుండా బతకటం దుర్భరం అన్న పరిస్థితికి వచ్చాడు. కాలేజీలో కూడా క్లాసుమేట్లు అతన్ని ఎగతాళి చేయసాగారు. ''షాడో'', అనీ, 'శాటిలైట్' అనీ వ్యాఖ్యానించేవారు. అతనది పట్టించుకునే వాడుకాదు. కాని ఉషకు పరిస్థితి భరించరానిదిగా వుంది. అతను ఎవరికీ నీడలా కాక స్వతంత్రంగా ఆలోచించగలగాలి, బతకగలగాలీ అని ఆశించింది ఆమె. కానీ ఈ పరిణామం ఆమె ఊహించలేదు. అతను తన కాళ్ళపై తాను నిలబడేటట్లు, స్వతంత్రంగా ఆలోచించేటట్లూ చేయాలని ఆమె ఎంత ప్రయత్నించినా అతను ఆమె మాటలు పట్టించుకునేవాడు కాదు. ఆమె ఎగతాళి చేసినా, కోపగించినా అప్పటికి కోపగించుకునేవాడు కాని, మరునాటికి మామూలే.

అందువల్లే నీరజ పెళ్ళికి తనొక్కడే వెళ్ళలేక, ఆమెనూ రమ్మంటే ఆమెకు చిరాకు కల్గింది. నిజానికామె నీరజ పెళ్ళికి వెళ్దామనే అనుకుంది. కాని మధు రమ్మనంగానే ఆమెకు కోపం వచ్చింది. అతన్తో పరుషంగా మాట్లాడింది. నీరజ పెళ్ళికి వెళ్ళకుండా మానేసింది.

ఎప్పటిలాకాక, వారం రోజులు ఉష కాలేజీలో కన్పించినా పలుకరించలేదు అతను. ఆమెకర్థమయింది- అతను స్వతంత్రపు బావుటా నెగరవేస్తున్నాడని. ఆ ఆలోచనతో ఆమెకు ఆనందంకూడా కలిగింది.

ఆరోజు క్లాసులవగానే బయల్దేరుతున్న అతన్ని పిల్చింది ఉష.

''విష్యూమెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్‌దడే'' అంటూ అతనికో పాకెట్టు అందించింది ఆమె.

''ఏంటిది?'' అడిగాడు మధు.

''మంచి స్నేహితుడి లాంటి మంచి పుస్తకం ఒకటి. మీ పుట్టినరోజు కానుక.''

''నా పుట్టిన రోజు ఇవాళ అని మీకెలా తెలుసు.'' అన్నాడతను ఆశ్చర్యపోతూ.

''ఆర్నెల్ల క్రితం మీరు బాంకి పరీక్షకు అప్లికేషను పంపలా. దాంట్లో మీరు మీ డేటాఫ్ బర్త్ నింపటంచూశాను.''

''ఓ థాంక్స్, నన్ను గుర్తుంచుకున్నందుకు.''

''స్నేహితుల్ని ఎలా మర్చిపోతాం. మీరే నన్ను మర్చిపోయినట్టున్నారు.''

''అదేం మాట. మీ ఋణం నేను జన్మజన్మలకీ తీర్చుకోలేను.''

''స్నేహంలో ఋణాలుండవు.''

''మరేముంటాయి?''

''ఆర్ద్రత, ప్రేమ స్నేహంలోని సహజ లక్షణాలు. మేఘాలు ఎందుకు వర్షిస్తాయి? చెట్టు పండ్ల నెందుకిస్తుంది? సూర్యుడు వెలుగు ఎందుకిస్తాడు? వాటికవి సహజ లక్షణాలు. తిరిగి మరేమీ ఆశించకుండా అందించేదే స్నేహం. మన పరీక్షలయిపోయిన రెండు రోజులకే నా పెళ్ళి. మీరు తప్పక రావాలి.'' అంది ఆమె.

''మీకు... పెళ్ళా....?'' అన్నాడు మధు వింతగా.

''అదేం, నేను పెళ్ళెందుకు చేసుకోను? అలా అడుగుతున్నారు. మన భారతదేశంలో ఆడపిల్లల పెళ్ళిళ్ళు ఎంత తొందరగా అయిపోతే, అంత హాయి. గుండెల మీద కుంపట్లు దించుకున్నట్టు ఫీలవుతారు తల్లిదండ్రులు. అందుకనే నాపెళ్ళి చేసేస్తున్నారు మావాళ్ళు.'' అంది ఆమె.

అతనికేదో అన్పించింది. ఆమె నాక్షణంలో నొప్పిస్తే ఆనందం కలిగేటట్లుంది అతనికి. ''ఆహాఁ, వేరే ఎవరికో నీడ అవటానికి వెళ్తున్నారన్నమాట'' అన్నాడు.

''నీడనిచ్చిన వాళ్ళను అనేమాటేనా అది. నేనెప్పటికీ ఎవరికీ నీడనవను. ఉషస్సును నేను. ఉషస్సుకు నీడలేదు'' అంది నవ్వుతూ ఉష.

''సారీ. మిమ్మల్ని నొప్పించాను'' అన్నాడతను.

''నేను నొచ్చుకోనుగా'' అంది ఆమె.

''మీరు పెళ్ళయి వెళ్ళిపోతే నాకు సాయం చేసే వాళ్ళూ, సలహాలిచ్చేవాళ్ళూ ఎవరుంటారు?'' అన్నాడు అతను బాధగా.

''మీరు మాత్రం ఇక్కడుంటారా? బాంక్ ఉద్యోగం వస్తే వెళ్ళిపోరూ? అయినా నేనేనా ప్రపంచం అంటే. ఇంకా మీకెందరో స్నేహితులు దొరుకుతారు. లోపం మీదే. చుట్టూ చూడటంలేదు. చూడండి, మీక్కావాల్సిన వాళ్ళు దొరుకుతారు. ఈ ప్రపంచం ఓ అద్దం మధూ!

మీరు నవ్వితే మీనీడ నవ్వుతుంది. మీరు ఏడిస్తే మీనీడ ఏడుస్తుంది. ఛాయిస్ మీదే.'' అంది ఉష.

ఆమెవంక విస్మయంగా చూశాడు మధు.

''ఇంత గొప్ప ఆలోచనలు ఎలా వస్తాయి మీకు?'' అన్నాడు.

''ఎవరికయినా వస్తాయి, ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడినప్పుడు'' అంది ఉష.

''బావుంది. నేను మాత్రం నాకాళ్ళమీద కాక, వేరే వాళ్ళ కాళ్ళమీద నిలబడ్డానా?'' అన్నాడు మధు.

''నాకదే కావాల్సింది. మీకాళ్ళ మీద మీరు నిలబడండి. మీకూ ఆలోచనలు వస్తాయి. నీడల కాలోచనలుండవు కానీ, మనుషులకెందుకుండవూ?'' అంది ఆమె.

తన్మయంగా ఆమె వంక చూస్తూ నిలబడ్డాడు అతను.

''వస్తాను మరి'' అని ఆమె సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

సాయంసూర్యుడి కభిముఖంగా నడుస్తోన్న ఆమె పొడుగాటినీడ, అతన్నుండి విడివడుతూ దూరంగా దూరంగా సాగిపోయింది.

'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఆదివారం అనుబంధం
26-2-1989


శుభాకాంక్షలతో

**జి. పుల్లారెడ్డి**

**స్వచ్ఛమైన నేతి మిఠాయిలు**

ఆబిడ్స్, స్టేషన్‌రోడ్,
హైదరాబాద్